ఘాటెక్కిన ఉల్లి



- కొండెక్కిన ధరలతో సామాన్యులు సతమతం
- మూడు నెలలుగా ఏ మాత్రం తగ్గని రేట్లు
- ధరాభారం తప్పడం లేదంటూ ప్రజల ఆవేదన

కాకినాడ సిటీ: నిన్న, మొన్నటి వరకూ నూనెల ధరలు చూసి నోరెళ్లబెట్టిన వినియోగదారులకు నేడు ఉల్లి ధరలు భయాందోళను రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే కూరగాయల ధరలు ఆకాశాన్నంటగా, వీటికి తోడు నిత్యావసరంగా ఉన్న ఉల్లి ధరలు అమాంతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కోయకుండానే ఉల్లి కన్నీరు తెప్పిస్తోందని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో ప్రజలు అత్యధికంగా రైతు బజార్లలో ఉల్లిపాయలు, కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. పట్టణానికి పరిసరాల్లో ఉన్న గ్రామాల ప్రజలు ప్రధాన రోడ్ల వెంబడి, మార్కెట్ల సమీపంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు వ్యాపారుల వద్ద ఉల్లిపాయలు, కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లకు వెళ్లిన వినియోగదారులకు ఉల్లిగడ్డలు కొనుగోలు చేయకుండానే కన్నీరు రప్పిస్తున్నాయి. గతంలో దిగుబడి బాగా తక్కువగా ఉన్న సమయంలో పలికిన ధర, నేడు మార్కెట్లలో పలుకుతున్నాయి.

రైతు మార్కెట్లో మొదటి రకం ఉల్లిపాయలు (పాతవి) కిలో రూ.55 నుంచి రూ.60 అమ్ముతున్నారు. బయట మార్కెట్లో ఇవే ఉల్లిపాయలు రూ.70 నుంచి రూ.75 వరకు విక్రయిస్తున్నారు. రెండో రకం ఉల్లిపాయలు రూ.60 నుంచి రూ.65 వరకు విక్రయిస్తున్నారు. **గత మూడు నెలలుగా ఉల్లి ధరలు చుక్కలంటుతున్నాయి. దిగుబడి తగ్గడంతో ఉల్లి ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లిపాయల ఉత్పత్తి ఎక్కువగా ఉండి, ఎగుమ**తులు చేసే మహారాష్ట్రలో దిగుబడులు తగ్గడంతో ఉల్లి ధరలు పెరుగుతున్నట్లు విశ్లేషిస్తున్నారు.

ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వం

ఉల్లి ధరలు భారీగా పెరిగిన సందర్భంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా రాయితీపై వినియోగదారులకు ఉల్లిపాయలు సరఫరా చేశారు. మార్కెట్లో అధిక ధరలు ఉండడంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని, ఉల్లిని కొనుగోలు చేసి వినియోగదారులకు రాయితీపై సరఫరా చేసింది. దీంతో సామాన్య, మధ్య తరగతి, పేద వర్గాల వారికి అప్పట్లో ఎంతో ప్రయోజనం కలిగింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిత్యావసరాలు, కూరగాయలు, ఆకుకూరలు, నూనెలు, ఉల్లిపాయలు ఇలా ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పట్టించుకునేవారు, అడిగేవారు లేకపోవడంతో వ్యాపారులు కూడా ఇదే అదును చూసి ఇష్టం వచ్చినట్లు రేట్లు పెంచుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, రాయితీపై ఉల్లిగడ్డలు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు నెలలుగా..

ఉల్లిపాయల దిగుమతులు తక్కువగా ఉండటంతో పాటు, మహారాష్ట్ర, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి దిగుమతులు రాకపోవడంతో గత మూడు నెలలుగా ఉల్లి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. గత జూన్‌లో కిలో రూ.25 ఉంటే, నేడు రూ.70కు చేరుకున్నాయి. ధరలు పెరిగిపోతున్నాయి మినహా తగ్గడం లేదని కొనుగోలుదారులు, వ్యాపారులు చెబుతున్నారు. జూన్‌కు ముందు పాత ఇనుము, ప్లాస్టిక్ వంటి పాత సామగ్రి కొనుగోలు చేసుకునే వారు కూడా ఉల్లిగడ్డలు తక్కువకు ఇచ్చి పోయేవారు. నేడు వారు కూడా ఉల్లి ధరలు ఎక్కువగా ఉండటంతో, వాటి స్థానే సబ్బులు ఇస్తున్నారు. ఉల్లి దిగుమతులు లేకపోవడంతో ధరలు పెరిగాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. రెండోరకం ఉల్లిపాయలు నాణ్యత లేకపోవడంతో కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఇష్టపడటం లేదు.

ధరలను నియంత్రించాలి



పనుల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూలీల చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రోజురోజుకూ పెరిగిపోతున్న కూరగాయలు, నిత్యావసర ధరలతో సామాన్య ప్రజలు సతమతమవుతున్నారు. అందుబాటులో ఉండేలా వాటి ధరలను ప్రభుత్వం అదుపులోకి తేవాలి.

– మేడిశెట్టి సత్తిబాబు, తాపీ మేస్త్రీ, కరప

దిగుబడి లేకే పెరుగుదల



వర్షాలు, వరదల వల్ల ఎగువ రాష్ట్రాల్లో ఉల్లిపాయల పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడి లేకపోవడంతో ఉల్లి రేట్లు పెరుగుతున్నాయి. అలాగే కూరగాయల ధరలు బాగా పెరిగాయి. వాతావరణ పరిస్థితుల వల్ల కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో మార్కెట్‌కు వచ్చే సరుకు తగ్గడంతో రేట్లు పెరిగాయి. ఈ రేట్లతో కూరగాయలు అమ్మడం కష్టంగా మారింది. రోజూ పెట్టుబడిలో కొంత నష్టం వాటిల్లుతోంది.

– కె.నాగేశ్వరరావు, ఉల్లి, కూరగాయల వ్యాపారి, కాకినాడ

క్లుప్తంగా

ఆర్డీవోగా మల్లిబాబు బాధ్యతల స్వీకరణ



కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం డిప్యూటీ సీఈవోగా పని చేస్తూ, సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ ఆర్డీవోగా నియమితులైన ఎస్ మల్లిబాబు శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్డీవో మల్లిబాబు కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో డి.తిప్పేనాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ మండలాల తహసీల్దార్‌గా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారిగా, పెద్దాపురం ఆర్డీవోగా, సెట్రాజ్ సీఈవోగా పని చేశానన్నారు. ఆ అనుభవంతో, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ కాకినాడ రెవెన్యూ డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని చెప్పారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది, డివిజన్‌లోని వివిధ మండలాల తహసీల్దార్లు ఆర్డీవో మల్లిబాబును కలిసి అభినందనలు తెలిపారు.

జేఎన్‌టీయూకేకు ఓఎన్‌జీసీ సహకారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈడీ రత్నేష్‌కుమార్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో నిర్వహించే కార్యక్రమాలకు ఓఎన్‌జీసీ సహకారం పూర్తిగా ఉంటుందని సంస్థ ఈస్ట్రన్ ఆఫ్‌షోర్ ఈడీ రత్నేష్‌కుమార్ అన్నారు. జేఎన్‌టీయూకే సొసైటీ ఆఫ్ పెట్రోలియం ఇంజినీర్ స్టూడెంట్ చాప్టర్ 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నేష్‌కుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు సంస్థ తరఫున సహకరిస్తామన్నారు. జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక వేతనం అందుకునేది పెట్రోలియం ఇంజినీర్లు మాత్రమేనన్నారు. అనంతరం 2024–25కు ఎన్నికైన జేఎన్‌టీయూకే ఎస్‌పీఈ స్టూడెంట్ చాప్టర్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుపమ సక్సేనా, గ్రూప్ జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్, ప్రబల్‌సేన్ గుప్తా, కిషోర్‌కుమార్, ఫ్యాకల్టీ అడ్వయిజర్ కేవీ రావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పరిశీలన

కాకినాడ సిటీ: నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణను నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్ శుక్రవారం పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ, డ్రైన్ల క్లీనింగ్ పనులను పర్యవేక్షించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా తీసుకుంటున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. నగరంలోని రామకృష్ణారావుపేట, నాయని వారి వీధి, గొలుసువారి వీధి, ఆనందభారతి పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ సెక్రటరీ, మేస్త్రీలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నలుగురికి జైలు శిక్ష విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. సర్పవరం పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు. వారికి రెండు రోజుల వంతున జైలు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన సుధీర్

కాకినాడ సిటీ: రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ నూతన చైర్మన్‌గా నియమితులైన తోట సుధీర్ శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్, జేసీ అభినందనలు తెలిపారు.

సినిమాలు

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్:	దేవర పార్ట్–1, దక్షిణ, సత్య సుందరం
దేవీ మల్టీప్లెక్సు 4 స్క్రీన్స్:	దేవర పార్ట్–1, సత్య సుందరం, కాళీ
లక్ష్మి:	దేవర పార్ట్–1
సత్యగౌరి:	దేవర పార్ట్–1
తిరుమల:	దేవర పార్ట్–1
సీఅండ్‌సీ1:	మత్తువదలరా
సీఅండ్‌సీ2:	శ్వాగ్
శ్రీప్రియ:	రామ్ నగర్ బన్ని
పద్మప్రియ:	దేవర పార్ట్–1
సూర్య (వాకలపూడి):	దేవర పార్ట్–1
సూర్య2:	మిస్టర్ సెలబ్రిటీ

సీవైఎఫ్ డైరెక్టర్ మూర్తిరాజుకు జాయింట్ కలెక్టర్ అభినందన



జేసీ రాహుల్ మీనాను కలుసుకున్న మూర్తిరాజు తదితరులు

కాకినాడ సిటీ: సమాజంలో చెడు వ్యసనాలకు బానిసలైన యువతను సన్మార్గంలో నడిపిస్తూ లండన్‌లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన సీవైఎఫ్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు బృందాన్ని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అభినందించారు. శుక్రవారం సాయంత్రం సీవైఎఫ్ డైరెక్టర్ మూర్తిరాజు ఆధ్వర్యంలో కాకినాడ కుళాయి చెరువు వద్ద ఫ్యాబిన్ కన్వెన్షన్‌లో జరిగే యువజన మహోత్సవాలు సెల్ టు హెల్ కార్యక్రమానికి జేసీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మూర్తిరాజు బృందాన్ని జేసీ అభినందించారు. గత 27 ఏళ్లుగా చెడు వ్యసనాలకు బానిసైన యువతను సన్మార్గంలో నడిపిస్తూ, యువతలో మార్పు తీసుకొచ్చేలా చేయడం ప్రశంసనీయమని జేసీ అన్నారు. రక్తదానంపై యువతకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కోఆర్డినేటర్ జాన్ వీక్లిఫ్, స్టేట్ కోఆర్డినేటర్ దూదిపాల్ శ్రీనివాస్, సీవైఎఫ్ నాయకులు విజయభాస్కర్, పెయ్యల నానిబాబు, మచ్చా బుజ్జిబాబు, వల్లూరి నానాజీ, తెలుగురవి, పెండ్యాల బాలు, రమేష్, నిఖిల్, లోకేష్, నదీష్, సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీని నెరవేర్చాలి



ఉచిత ఇసుక హామీపై ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: కూటమి పార్టీలు గత ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీ తక్షణం అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కాకినాడ కలెక్టరేట్ వద్ద శుక్రవారం సీపీఎం పెద్దఎత్తున ధర్నా చేపట్టింది. ధర్నాను ఉద్దేశించి పార్టీ జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్, సీనియర్ నాయకులు దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ, ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. వంద రోజుల పాలనలో ఉచిత ఇసుక హామీ ఊసే లేదని విమర్శించారు. జిల్లాలో అనేక చోట్ల ఇసుక లభించడంలేదని, రవాణా చార్జీలు, ఇతర పేర్లు చెప్పి ఇసుక రేట్లు తగ్గించలేదన్నారు. కొన్నిచోట్ల మరింత పెరిగాయన్నారు. ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికార కూటమి నేతలు పలుచోట్ల ఇసుకపై పెత్తనం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే బహిరంగంగా హెచ్చరిస్తున్నా, పరిస్థితిలో మార్పు లేదని విమర్శించారు. ఇసుక కొరత, అధిక రేట్ల వలన భవన నిర్మాణ రంగం కుదేలవుతోందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కొరవడుతోందని, ఇళ్ల నిర్మాణాలు చేసుకునే చిన్న, మధ్య తరగతి వర్గాలపై భారం పడుతోందన్నారు. ఇసుక ఆన్‌లైన్ విధానం ప్రవేశపెడుతున్నామని ప్రభుత్వం ప్రకటనలకు, హామీలకు ఆచరణలో పొంతన లేదని, ధరల్లో తీవ్ర వ్యత్యాసం ఉందని దుయ్యబట్టారు. అందరికీ ఉచితంగా ఇసుక లభించే విధంగా చర్యలు చేపట్టి, కార్మికులకు ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు. అలాగే 1214 మెమోను రద్దు చేసి సంక్షేమ బోర్డును కొనసాగించాలన్నారు. నిలుపుదల చేసిన క్లెయిమ్‌లు, పెండింగ్ కార్డులు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేఎస్ శ్రీనివాస్, తిరుమలశెట్టి నాగేశ్వరావు, పలివెల వీరబాబు, పెద్దింశెట్టి రామకృష్ణ, సీహెచ్ రాజ్‌కుమార్, సీహెచ్ అజయ్‌కుమార్, ఎంవీ రమణ, టి రాజా, సీహెచ రమణి, కె సత్తిరాజు, ఏ ఏడుకొండలు, సీహెచ్ పద్మ, గుత్తుల రామకృష్ణ, హరినాథ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

భవానీ, అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో భవానీ, అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ శుక్రవారం ప్రారంభించారు. సర్పవరం గ్రామంలోని దాతల సహకారంతో ప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో కార్తిక మాసం చివరి వరకు మధ్యాహ్నం పూట అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశామని, రోజుకు 1,500 మంది వరకు హాజరవుతారని కమిటీ తెలిపింది.

దేశభక్తి, అభ్యుదయ గీతాల శిక్షణ

కాకినాడ సిటీ: దసరా సెలవుల సందర్భంగా ఈ నెల 6, 7, 8 తేదీల్లో కాకినాడ కచేరిపేటలోని యూటీఎఫ్ హోంలో దేశభక్తి, అభ్యుదయ గీతాల శిక్షణా శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఎఫ్‌ఐ కాకినాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ సంజయ్, ఎ వాసు శుక్రవారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణతో వన్యప్రాణుల సంరక్షణ



చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు: పర్యావరణ పరిరక్షణతో వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమని ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా సహజీవనం ద్వారా వన్యప్రాణుల సంరక్షణ అనే అంశంపై శుక్రవారం వివేకానంద ఉద్యానవనంలోని శాఖా గ్రంథాలయంలో జిల్లా స్థాయిలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు 34 పాఠశాలలు, కళాశాలల నుంచి 286 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతో వన్యప్రాణి సంరక్షణ సాధ్యమన్నారు. ఆవరణ వ్యవస్థలో సమతుల్యత ఉన్నప్పుడే జీవుల మనుగడ సాధ్యమవుతుందన్నారు. ఏదైనా ఒక జాతి నశించిపోయిందంటే, దానిపై ఆధారపడే ఇతర జాతులూ నశించే ప్రమాదం ఉందన్నారు. జీవ వైవిధ్యంపై కూడా దాని ప్రభావం ఉంటుందన్నారు. యూఎస్‌టీపీ జిల్లా సమన్వయకర్త శ్రీహర్ష మాట్లాడుతూ, సృష్టిలో ప్రతి జీవికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. మన అడవులు కార్బన్ సిస్కి టాంక్‌లా పని చేస్తూ, దేశంలో విడుదలయ్యే గ్రీన్‌హౌస్ వాయువులో 11 శాతం నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పర్యావరణం బాగుండాలంటే చెట్లను పెంచడం, అడవులను కాపాడుకోవడం అందరి బాధ్యతన్నారు. వన్యప్రాణులను కాపాడుకోవాలని కోరారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ వన్యప్రాణులపై నిర్వహించిన క్విజ్ కార్యక్రమం, పర్యావరణ గీతాలు, జాతీయ స్థాయి పప్పెట్రి శిక్షకులు పిల్లి గోవిందరాజులు, వన్యప్రాణులపై పప్పెట్రి, ప్రముఖ ఇంద్రజాలకుడు వీఎస్‌వీ రమణమూర్తి పర్యావరణ ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ ఎం శ్రీనివాసరావు, వైల్డ్ లైఫ్ బయాలజిస్ట్ డి మహేష్‌బాబు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా పోటీలకు పలువురి ఎంపిక



ఎంపికైన వారిని అభినందిస్తున్న చిట్టిబాబు

బాలాజీచెరువు: కర్నూల్‌లో ఈ నెల ఐదు నుంచి ఏడో తేదీ వరకూ నిర్వహించే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు కాకినాడ యోగా క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన యోగా క్రీడాకారులు కె.భాస్కర సాయిరామ్, జి.లహరిదుర్గ, ఆర్.చైత్ర శివవాసుకి, పి.వెంకట లోవరాజు, కె.వెంకటేష్, ఎం.మౌళి అర్హత సాధించారు. ఎంపికైన వారిని ఏపీ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు అభినందించారు.

ఘనంగా సామూహిక కలశ పూజ



తూరంగి కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో చేస్తున్న కలశపూజ

కాకినాడ సిటీ: శరన్నవరాత్రులను పురస్కరించుకుని తూరంగి కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రముఖ వ్యాపారవేత్త, కాకినాడ బంగారం, వెండి, డైమాండ్స్ వర్తక సంఘం అధ్యక్షులు అనిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం 400 మంది మహిళలతో సామూహిక కలశ పూజ నిర్వహించారు. తూరంగి పంచాయతీ కార్యాలయం సమీపంలో అమ్మవారి భక్తురాలు సంధ్యారాణి కోరిక మేరకు ఆలయాన్ని అభివృద్ధి చేశారన్నారు. మూలా నక్షత్రం రోజున సరస్వతి పూజలు, విజయ దశమి రోజున భారీ అన్న వితరణ మహా సంతర్పణ ఉంటాయని వివరించారు.

సర్వం అమ్మ మయం



రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో కామాక్షిగా..



ఊయల అలంకరణలో సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి అమ్మవారు



భానులింగేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవిగా..



జపమాల అలంకరణలో మాధవనగర్ కనకదుర్గ అమ్మవారు



కాకినాడ శ్రీపీఠంలో శ్రీదుర్గాదేవిగా ఐశ్వర్యాంబిక అమ్మవారు



విజయలక్ష్మీదేవి అలంకరణలో దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు



రమణయ్యపేట శ్రీపీఠంలో మహాశక్తి యాగం ప్రాంగణంలో కేరళ వాయిద్యాలు



శ్రీపీఠంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి

కాకినాడ రూరల్: గ్రామాల్లో దసరా పూజలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారిని ఒక్కోచోట ఒక్కో రూపంలో అలంకరణలు చేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు కుంకుమ పూజల్లో తరిస్తున్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ప్రసూన, కాకినాడ విజన్ కార్యదర్శి శ్రీదేవిరెడ్డి, కోశాధికారి శ్రీవాణి, లయన్స్ ప్రాంతీయ చైర్మన్ పద్మతులసి తదితరులు పాల్గొన్నారు. శేషాద్రినగర్‌లో బాల కనక దుర్గమ్మ ఆలయంలోనూ ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

దుర్గ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఊయల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొనేందుకు రావడంతో ఆలయ ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పర్ణిక నృత్యాంజలి ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. దాతల సహకారంతో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు విజయలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులు అన్నదానం నిర్వహించారు. మాధవనగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారు జపమాల అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయంలో నవావర్ణార్చన, కుంకుమ పూజ నిర్వహించారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సంతచెరువు కామాక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి నవర్ణార్చన పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రమణయ్యపేటలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



కాకినాడ రూరల్ శేషాద్రినగర్‌లో కుంకుమ పూజల్లో మహిళలు